# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 08-01-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నంలో ఈరోజు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేస్తారు.**

**2.** **విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పాలీటెక్ ఫెస్ట్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.**

**3.** **ఇంటర్ మొదటి సంవత్సరంలో పరీక్షలు లేకుండా ఒకేసారి ద్వితీయ సంవత్సరంలో పరీక్షలు నిర్వహించనున్నామని విద్యాశాఖ వెల్లడించింది.**

**4** **తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రపంచ తెలుగు మహాసభలు ఈ రోజు ప్రారంభమయ్యాయి.**

**5** **సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.**

==========================

జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లో భాగంగా భారత దేశపు మొట్ట మొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్ కు ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నంలో శంఖుస్థాపన చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి దోహదపడే దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన పలు ప్రాజెక్టులకు ఈ రోజు సాయంత్రం శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

ఇది ఇలా ఉండగా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. విశాఖపట్నంలోని బిజెపి కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ దేశం, ఆర్థికంగా, సాంకేతికంగా పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. ప్రధానమంత్రి విశాఖ పర్యటనతో రాష్ట్రానికి మరింత ప్రయోజనం కలగనుందని కృష్ణయ్య తెలుపుతూ

వాయిస్ సెకన్లు ( 27 )

--------------------------

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పాలీటెక్ ఫెస్ట్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విజయవాడలో జరుగుతున్న పాలీటెక్ ఫెస్ట్ 2024-25లో మంత్రి పాల్గొని విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టును పరిశీలిస్తూ విద్యార్థులను

వివరాలను అడిగి తెలుసుకున్నారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ఇంటర్ మొదటి సంవత్సరంలో పరీక్షలు లేకుండా ఒకేసారి ద్వితీయ సంవత్సరంలో పరీక్షలు నిర్వహించనున్నామని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా వెల్లడించారు. అమరావతిలో ఈ రోజు ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, సీబియస్ఈ తరహాలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు తొలగిస్తామని, ఆయా కళాశాలలు అంతర్గతంగా ప్రథమ సంవత్సర పరీక్షలు నిర్వహిస్తాయని అన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలనే బోర్డు నిర్వహిస్తుందని, దీనికి సంబంధించిన పలు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఇంటర్ విద్యలో సంస్కరణలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 26 వ తేదీలోపు సలహాలు, సూచనలు పంపాలని కృతికా శుక్లా తెలిపారు

---------------------------

గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించిన షెడ్యూల్డ్ కులాల గణన వివరాలపై అభ్యంతరాల స్వీకరణ గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. నిన్నటితో గడువు ముగియగా, తాజాగా దాన్ని ఈనెల 12వ వరకు పొడిగిస్తూ సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అభ్యంతరాలను ఈనెల 16వ తేదీ లోగా పరిష్కరించి.. తుది నివేదికను ఈ నెల 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈ ఉదయం ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభమయ్యాయి. దాదాపు 560 మంది కవులు పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి నన్నయ, రాజరాజ నరేంద్రుడు, కందుకూరి వీరేశలింగం పేర్లతో మూడు వేదికలను ఏర్పాటు చేశారు. రాజానగరంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం వేదికగా రెండు రోజుల పాటు జరిగే ఈ సభలలో ప్రముఖ తెలుగు సాహితీ ప్రముఖులు, భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, తెలుగు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు , శాసనసభ్యులు, కళాకారులు, నటీనటులు పాల్గొననున్నారు.

---------------------------

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరగనున్న మహా కుంభమేళాకు వెళ్లే కళ్యాణరథాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం -టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కుంభమేళా జరిగే ప్రదేశంలో 2.5 ఎకరాల స్థలంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి నమూనా ఆలయం ఏర్పాటు చేసి, తిరుమల తరహాలో అన్ని కైంకర్యాలను నిర్వహిస్తామని చెబుతూ

. వాయిస్ 30 సెకన్లు

---------------------------

సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ నెల 9న కాకినాడ టౌన్ – వికారాబాద్, 10న వికారాబాద్ – శ్రీకాకుళం రోడ్, 11న

శ్రీకాకుళం రోడ్ – చర్లపల్లి, 12న చర్లపల్లి – కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీదర్ ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే "పరీక్షా పే చర్చా" కార్యక్రమంలో రాష్ట్రంలోని తిరుపతి జిల్లా లో లక్ష 3 వేలు మంది పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా రెండో స్థానంలో నిలిచిందని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు తెలిపారు. తిరుపతిలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని శ్రీకాళహస్తిలో అత్యధిక మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పరీక్ష పే చర్చ కార్యక్రమానికి తమ పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. విద్యార్థుల్లో పరీక్షల పట్ల సందేహాలను పోగొట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలుపుతూ.

వాయిస్ ( 36) సెకన్స్

---------------------------

స్వచ్ఛ శ్రీశైలం నిర్వహణలో భాగంగా శ్రీశైల క్షేత్ర పరిధిలో ఈ రోజు " పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమం" నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టనున్నామని చెప్పారు. స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా క్షేత్రాన్ని 6 జోన్లుగా, 11 సెక్టార్లుగా, 68 ప్రదేశాలుగా విభజించడం జరిగిందని, అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతి జోన్‌కు పర్యవేక్షకులుగా ప్రత్యేక అధికారులను నియమించామని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బందితో పాటు స్థానికులందరూ పాల్గొనాలని కోరారు.

---------------------------

హ్యూమన్ మెటా న్యూమో హెచ్‌ఎంపివి వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ.బి.దేవి తెలిపారు. అనంతపురంలో ఈ రోజు ఆమె మాట్లాడుతూ హెచ్‌ఎంపివి వైరస్ కి సంబంధించిన కేసులు జిల్లాలో ఎక్కడా నమోదు కాలేదని అన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా వున్న వారిపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా వుంటుందన్నారు. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కోవిడ్ సమయంలో పాటించిన తరహాలోనే జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు.

---------------------------

వ్యవసాయరంగంలో ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. తెలంగాణ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న ఉద్యాన ఉత్సవం – 2025 విజ్ఞాన యాత్రలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వెళ్తున్న రైతుల బస్సును ఒంగోలులో ఆమె నిన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా నుంచి 70 మంది రైతులు యాత్రకు వెళుతున్నట్లు తెలిపారు. ఉద్యాన ఉత్సవంలో వివిధ రకాల ఫల,పుష్పాల ప్రదర్శన ఉంటుందని చెప్పారు, ఇటువంటి యాత్రల వల్ల రైతులకు వివిధ రకాల పంటల పట్ల అవగాహన కలుగుతుందని వివరించారు.

=====================